
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

గురువారం 23 అక్టోబరు 2025



సమగ్ర ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి







మంత్రి దామోదర్ సమక్షంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్యతో నిర్మల, ఎస్పీ పరితోష్ పంకజ్‌తో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర ఆరోగ్య శిబిరంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఇందులో భాగంగా మంత్రి దామోదర్ సమక్షంలో నిర్మలా జగ్గారెడ్డి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎస్పీ పరితోష్ పంకజ్, కలెక్టర్ ప్రావీణ్యతో వివిధ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగనిర్మల, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, డాక్టర్ జి.శ్రీహరి పాల్గొన్నారు.





వాన జల్లు.. రైతుల్లో గుబులు

సిద్దిపేట సమీకృత మార్కెట్ యార్డులో బుధవారం మధ్యాహ్నం కురిసిన చిరుజల్లులు రైతన్నల గుండెల్లో గుబులు రేపాయి. అప్రమత్తమైన రైతులు వడ్లను, మక్కలను త్వరత్వరగా కుప్పలుగా పోశారు. చినుకులు ధాన్యాన్ని తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు, కవర్లను కప్పి కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే, దళారుల బేరసారాలు, తరుగు సమస్యలతో ఇప్పటికే నష్టపోతున్న రైతులు... ఇప్పుడు వర్షాలకు భయపడాల్సి వస్తుంది. మార్కెట్ యార్డులో సరైన వసతులు లేకపోవడం, సరిపడా టార్పాలిన్లు లేక, ఆరబోసిన పంటను కాపాడుకునేందుకు పడుతున్న ఈ పాట్లు రైతుల దయనీయ పరిస్థితికి నిదర్శనం.

- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గిరి ప్రదక్షిణ

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మెదక్ రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ ముందుగా ఆలయం వద్ద గిరి ప్రదక్షిణకు అంకురార్పణ చేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్త ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్తీక మాసంలో రెండు సార్లు గిరి ప్రదక్షణ రావడం భక్తులు అదృష్టమన్నారు. మొదటి నేడు పూర్తయ్యిందని, రెండోది వచ్చేనేల నవంబరు 18న వస్తుందన్నారు.

శాస్త్రోక్తంగా
ఉద్వాసన క్రతువు

సిద్దిపేటకల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవతామూర్తుల పాత పటాలకు భక్తితో వీడ్కోలు పలికే ఉద్వాసన క్రతువు శాస్త్రోక్తంగా ముగిసింది. ఇంట్లో పూజకు ఉపయోగించని దేవతామూర్తుల చిత్రపటాలను ఈ నెల 17 నుంచి 21 వరకు 39 వార్డు కౌన్సిలర్ దీప్తి నాగరాజు ఆధ్వర్యంలో సేకరించి బుధవారం పట్టణంలోని స్వచ్ఛబడిలోని జమ్మిచెట్టు వద్ద అమ్మవారి ఉపాసకులు, ప్రవచనకర్త గోసాం శివప్రసాదశాస్త్రి పర్యవేక్షణలో వాటికి ఉద్వాసన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని 'ఉద్వాసన క్రతువు' అనే ప్రత్యేక కథనం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు.



ఉపయోగంలో లేని దేవతామూర్తులు చిత్రపటాలు

పీహెచ్‌సీని
తనిఖీ చేసిన కలెక్టర్

- హాజరు, ఓపీ రిజిస్టర్ల తనిఖీ
- వైద్యసేవలపై ఆరా

తొగుట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తొగుట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. అటెండెన్స్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయుష్ కేంద్రంలో యునాని వైద్య సేవలు పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని యునానీ వైద్యురాలిని ఆదేశించారు. కలెక్టర్ తన కాలి మడమ నొప్పి వస్తుందని యునానీ వైద్యురాలికి చెప్పగా "హబ్బే జోగ్రజ్ గోగుల్" మాత్రలు రోజుకు రెండు చొప్పున ఉదయం, సాయంత్రం కొంచెం వేడి నీటితో వేసుకుంటే తగ్గుతుందని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్, వైద్యులు రాధాకిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో తండ్రిని హతమార్చిన కొడుకు 7

జిల్లాలో ఓపెన్ హౌజ్
- చట్టాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన
8

భోజనం భారం!

- మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం!
- తొమ్మిది నెలలుగా అందని బిల్లులు
- జీతాల జాడే లేదు
- ఇప్పటికే పలుమార్లు నిరసనలు
- నవంబరు 1 నుంచి వంట బంద్!



మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు (ఫైల్)

తొమ్మిది నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతనం, ఐదు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. అంతేకాకుండా, తొమ్మిది నెలలుగా ఎగ్ బిల్లులు, ఐదు నెలలుగా కూరగాయలు, కిరాణా బిల్లులు నిలిచిపోయాయి. ఒక వైపు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తుంటే, మరోవైపు వేతనాలు, బిల్లులు రాక మధ్యాహ్న భోజన పథకం కార్మికుల దుస్థితి దినదిన గండంగా మారింది. జిల్లావ్యాప్తంగా సుమారు 952 పాఠశాలల్లో 80 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి సేవలు అందిస్తున్న దాదాపు రెండువేల మందికి పైగా కార్మికులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- సిద్దిపేట అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం నుంచి తొమ్మిది నెలల వేతనం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 2వేల వేతనం ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి కార్మికులకు ఇస్తున్న మొత్తం వేతనం రూ. 3వేలు మాత్రమే. ఎగ్ బిల్లుల విషయానికి వస్తే, ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 60 చొప్పున జిల్లావ్యాప్తంగా ఒక్క నెలలోనే సుమారు రూ. 3.50కోట్లు రావాల్సి ఉంది. ఈ మొత్తం గత 9 నెలలుగా పెండింగ్‌లో ఉంది. అలాగే, కూరగాయలు, కిరాణాకు సంబంధించిన బిల్లులు సుమారు ఐదు నెలల నుంచి నిలిచిపోయాయి. కూరగాయాలు, కిరాణం బిల్లులకు సంబంధించి ఒక్క రోజుకు 1వ తరగతికి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.8, 6 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.11, 9 నుంచి 10 వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.12 రావాల్సి ఉండగా ఇవి ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. తొమ్మిది నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో అప్పులు చేసి ఆహారాన్ని అందిస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాణ షాపుల్లో ఖాతాలు, తమ చేతిలో నుంచి డబ్బు పెట్టి కూరగాయలు కొనుక్కొచ్చి వంట చేస్తున్నామని కార్మికులు వాపోతున్నారు.

కలెక్టర్ మేడం.. మా కష్టాలు తీర్చండి!

ఒకపక్క బిల్లులు రాకపోవడం, మరోపక్క నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఆదేశాలతో మధ్యాహ్న భోజన పథక కార్మికులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో కార్మిక సంఘాల సహకారంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట

మిగతా 8వ పేజీలో

నవంబర్ 1 నుంచి వంట నిలిపివేత

సమస్యను పరిష్కరించి, పెండింగ్ బిల్లులను విడుదల చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో, వచ్చే నవంబరు 1 నుంచి మధ్యాహ్న భోజనం వండడం నిలిపివేసి, నిరసన తెలుపుతామని హెచ్చరించారు. మంగళవారం సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన కార్మికులు, నవంబరు 1 నుంచి పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించి నిరసనకు దిగుతామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సంక్షేమానికి ప్రాధాన్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం రూ. 9లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ప్రతినెల రూ. 5 వేల కోట్ల వడ్డీని చెల్లిస్తున్నప్పటికీ, ఎన్ని ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కడా సంక్షేమ పథకాలను ఆపడం లేదని కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొనియాడారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హైమావతి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదలకు కొత్తగా 26 వేల రేషన్‌కార్డులను ఇవ్వడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో లక్ష రూపాయలు జమ చేశామని పేర్కొన్నారు. జిల్లా సమస్యలపై మంత్రి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో నిలిచిపోయిన మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎలాంటి ఘర్షణలు జరగకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



దుబ్బాకలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నీళ్ల కోసం మరో ఉద్యమం

- దుబ్బాకకు నీళ్లివ్వకపోతే.. హైదరాబాద్‌కు వెళ్లే మల్లన్నసాగర్ జలాలను అడ్డుకుంటాం
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాము భూములను త్యాగం చేసి, అనేక అవస్థలు పడితే, తమకు కాకుండా హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ నీళ్లను తరలిస్తామంటే దుబ్బాక ప్రజలు ఊరుకోబోరనీ, అసంపూర్తిగా వదిలేసిన పంట కాలువలను వెంటనే పూర్తి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ హయాంలో ప్రాజెక్టును కడితే, కనీసం తట్టెడు మట్టిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తీసింది లేదని ఆయన మండిపడ్డారు. బుధవారం దుబ్బాక మార్కెట్ కమిటీతోపాటు, మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి, చెల్లాపూర్, మల్లాయపల్లి, లచ్చపేట, ధర్మాజీపేట, చేర్వాపూర్, మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి గ్రామాల్లో మెప్మా, ఐకేపీల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు రెండేళ్ల కాలంగా కాలువలు నిర్మించి నీళ్లు అందించాలని కోరుతున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు మూలంగా తాము సర్వం కోల్పోయామని, తమ కడుపు నిండిన తర్వాతే బయటకు నీళ్లు తీసుకెళ్లాలన్నారు. రైతుల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కౌలాస్ ముదిరాజ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మక్కలు దళారులపాలు

- కొనుగోలుపై నియంత్రణ ఎత్తేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో ఆలస్యం చేయడం వల్ల సిద్దిపేట మార్కెట్ యార్డులో 14 వేల క్వింటాళ్ల మక్కలు దళారులపాలయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో వడ్ల, మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల మక్కల రైతులు మద్దతు ధర కంటే తక్కువకు, అంటే రూ. 1600 దళారులకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. ఎకరాకు కేవలం 18క్వింటాళ్లు మాత్రమే కొంటామని ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. రైతు 25 నుంచి 30 క్వింటాళ్ల మక్కలు పండిస్తే, 18 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొంటానంటే, మిగతా పంట దళారుల పాలవుతుందనీ, మక్కల కొనుగోలుపై పెట్టిన నియంత్రణను ఎత్తివేయాలని, పండించిన మక్క పంటను పూర్తిగా కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గింజకు మద్దతు ధర ఇచ్చుకుంటూ.. ప్రతి పంటకు బోనస్ ఇప్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాడ లేదన్నారు. కొనుగోలు కేంద్రాలను కూడా అడగ్గా అడగ్గా అరిగోస పెట్టి ప్రారంభిస్తున్న ప్రభుత్వం... బోనస్ కూడా ఒక పంటకు ఇచ్చి ఒక పంటకు ఎగవేసిందన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్ కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, ఏఎంసీ సెక్రటరీ వెంకటయ్య, అకౌంటెంట్ సురేష్, మార్క్‌ఫెడ్ సిబ్బంది లక్ష్మణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

- వాణిజ్య పంటల వైపు రైతులు దృష్టి పెట్టాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్



జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పత్తి, మొక్కజొన్న, వరి ధాన్యం అమ్మకాలలో దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అందుబాటులోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణ శివారులోని గోమాత కాటన్ జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని, హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కె. హైమావతి, అధికారులతో కలిసి ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన పత్తి తేమ శాతాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు తమ పంటను కపాస్ యాప్ ద్వారా నమోదు చేసుకుంటే ఓటీపీ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని సూచిస్తుందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.8100 ఉందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాజమార్గం ద్వారా పత్తిని అమ్ముకోవాలని సూచించారు. జిల్లాలో నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో రైతుల కోసం మెగా రైతు మేళాను ఏర్పాటు చేసి వాణిజ్య పంటలు, ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, చిత్తారి రవీందర్, పద్మ, జైపాల్‌రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సీసీఐ, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

- మరొకరికి గాయాలు
- హైవే రోడ్డు దాటుతుండగా ఢీకొన్న కారు

తూప్రాన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారు హైవే బైపాస్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరోకరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు చెందిన బోండ్ల స్వామి (50), చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామానికి చెందిన బండారి దుర్గయ్య (55) వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హైవే రోడ్డును దాటుతుండగా నిజామాబాద్ వైపు వెళుతున్న కారు వీరిద్దరిని వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బండారి దుర్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కిష్టాపూర్‌కు చెందిన బొండ్ల స్వామి రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని తూప్రాన్ ఆసుపత్రి మార్చురీకి తరలించగా, స్వామిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

రెండు గదుల్లో మున్సి‘పాలన’

- హాల్‌లో పదిమంది కార్యదర్శులు
- చైర్మన్‌కూ చాంబర్ లేదు
- ఇక్కట్ల మధ్యే సిబ్బంది విధుల నిర్వాహణ

జిన్నారం, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): జిన్నారం నూతన మున్సిపాలిటీకి పక్కా భవనం లేక ఇరుకు గదులతో సిబ్బంది, అధికారులు అవస్థలు పడుతున్నారు. జిన్నారం కేంద్రంగా ఇటీవలే నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు కాగా పాత పంచాయతీ భవనంలో తాత్కలికంగా కార్యలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భవనంలో కేవలం రెండు గదులు ఓ హాల్ ఉండగా మున్సిపాలిటీ సేవలకు, విధుల నిర్వహణకు ఏ మాత్రం సరిపోవటం లేదు. మండలంలో మండల పరిషత్ వ్యవస్థ రద్దు కావటంతో స్థానికంగా ఖాళీగా ఉన్న ఏంపీపీ భవనం మున్సిపల్ కార్యాలయానికి కేటాయిస్తే అన్ని వసతులు సమకురుతాయని అధికారులు కోరుతున్నారు.

ఇరుకు గదులతో సిబ్బంది ఇక్కట్లు

పాత పంచాయతీ భవనంలో మున్సిపల్‌కార్యాలయం ఏర్పాటు చేయగా ఇందులో కేవలం రెండు గదులు ఉండగా కమిషనర్, ప్రత్యేక అధికారి కోసం వినియోగిస్తున్నారు. ఇక ఉన్న ఒకే ఒక్క హాల్‌లో మున్సిపల్ విలీన గ్రామాలకు చెందిన 10 మంది కార్యదర్శులు, మరి కొందరుల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సౌకర్యాలు లేక సిబ్బంది తీవ్ర అసౌకర్యాల మధ్య పనులు చేస్తున్నారు. ఇక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, కమిష్‌నర్, ఆర్‌వో, శానిటరీ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సహ పలు విభాగాలకు ప్రత్యేక చాంబర్లు అవసం ఉంటుంది. దీనికి తోడు మున్సిపల్ పాలక వర్గం 20 మంది, అధికారులతో నిర్వహించే సమావేశాల కోసం కౌన్సిలర్ల సమావేశాలకు ప్రత్యేకంగా హాల్ అవసరం ఉంటాయి.

నిరుపయోగంగా ఏంపీపీ భవనం..

జిన్నారంలో మండల పరిషత్ వ్యవస్థ స్థానంలో మున్సిపల్ పాలన అమలులోకి రాగా స్థానికంగా ఉన్న ఏంపీపీ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో మున్సిపాలిటీ కార్యలయానికి ఉన్న భవనం సమస్యను ఏంపీపీ భవనం కేటాయిస్తే వినియోగంలోకి వస్తుందని అధికారులు అంటున్నారు. పాత ఏంపీపీ భవనంలో 10 వరకు ప్రత్యేక గదులు, 75 మంది వరకు కూర్చునే సమావేశ మందిరం సహ అన్ని వసతులు ఉన్నాయి. చుట్టూ ప్రహరీతో పాటు 25 కార్లు కూడా పార్క్ చేసేవిదంగా స్థలం ఉన్నది. ఈ భవనాన్ని పుర కార్యలయంగా ఏర్పాటు చేస్తే వివిద పనుల కోసం వచ్చే 10 గ్రామాల ప్రజలు, కౌన్సిలర్లు, చైర్మన్ సహ అధికారులందరికి సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ భవనంలో గతంలో ఉన్న అధికారులు కూడా ఇతర చోట్లకు బదిలీ పై వెళ్ల టంతో ఖాళీగానే ఉన్నది.



ఒకే గదిలో విధులు నిర్వహిస్తున్న 15 మంది మున్సిపల్ సిబ్బంది.

ఏంపీపీ భవనం కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేశాం: కమిషనర్



జిన్నారం మున్సిపల్ కార్యలయం కోసం పాత ఏంపీపీ భవనం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ అందజేశామని మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. ప్రస్తుత భవనం సిబ్బంది, ప్రజల అవసరాల మేరకు లేదని, వాహనాల పార్కింగ్ సహ ఇతర సమస్యల పరిష్కారానికి ఏంపీపీ భవనం కేటాయించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని కమిష్‌నర్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, గ్రామాల్లో సర్పంచులు, వార్డు మెంబర్లు లేక గ్రామాభివృద్ధి కుంటుబడిపోయిందని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్ అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వంలో ఒక శాఖగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎవరిని అడగాలో తెలియక అయోమయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ ఎలక్షన్లు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

హుస్నాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి 15 రోజులు గడిచినా, ఇప్పటి వరకు కేవలం 2,500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయగా యార్డులో ఇంకా 8000 క్వింటిళ్ల వరకు అలాగే ఉన్నాయన్నారు. రోజుకు 800 క్వింటాళ్ల వరకు బార్దన్ సంచులు ఇవ్వడంతో అలస్యంగా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు.

ఐదున్నర కిలోల మాస్ తొలగింపు



ఆపరేషన్ చేసిన వైద్యులు, సిబ్బంది

దుబ్బాక, అక్టోబరు22(అంధ్రజ్యోతి): దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో బుధవారం ఒక రోగినుంచి 5కిలలో 500గ్రాముల లార్డ్ ఓవరియన్ మాస్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్ ఆద్వర్యంలో తొలగించారు. అరుదైన ఆపరేషన్‌ను ఆయన విజయవంతంగా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపెట మండలం శ్రీగాదా గ్రామానికి చెందిన మమత (40) కొన్నిరోజులు గా తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రి వచ్చి, వైద్యుల సూచన మేరకు వైద్య పరీక్షలను నిర్వహించారు. రోగి మమతకు రక్తం తక్కువగా ఉంటే రెండు గ్రాముల రక్తం కూడా అందించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా వేముల మమత. కు ఆపరేషన్ చేసి సుమారు 5కిలోల 500గ్రాముల ఓవరియన్ గడ్డను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ విజయవంతంగా తొలగించారు. ఈవైద్యచికిత్సలో మత్తు వైద్యులు డాక్టర్ రాఘవేందర్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



నంగునూరులో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడి

నంగునూరు, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంగునూరు మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులను మించిన వృత్తి మరొకటి లేదని విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి మంచి సేవ చేసే విధంగా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా ప్రతీ ఉపాధ్యాయుడు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దేశిరెడ్డి ,నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జానయ్య, మగ్దుంపూర్ హై స్కూల్ హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి యువకుడి మృతి



చాంద్ పాషా(ఫైల్)

అక్కన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో నీటి కుంటలో దూకి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం అక్కన్నపేట మండలం జనగామ గ్రామ శివారులోని క్రషర్ వద్ద చోటుచేసుకుంది. అక్కడ ఉన్న యువకులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన నలుగురు యువకులు క్రషర్ వద్ద ఉన్న నీటి కుంట వద్దకు వచ్చారు. అందులోని ఇద్దరి యువకులు మద్యం తాగుతుండగా మరో యువకుడు చాంద్ పాషా (21) దుస్తులు విప్పి అకస్మాత్తుగా నీటి కుంటలో దూకాడు. ఎంతకీ పైకి రాకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి రిస్క్‌టీంతో రాత్రి వరకు వెతికినా మృతి దేహం లభ్యం కాలేదు. దీంతో చేసేది ఏమీ లేక ఉదయం గాలింపు చర్యలు చేపడతామని వారు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు చాంద్ పాషా మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య



దేవదానం(ఫైల్)

కొండపాక, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందని మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మార్వాడి దేవదానం (33) ఆటో నడుపడంతో పాటు డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య మమత ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆటోలు సరిగా నడవకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా తయారయింది. తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఏదైనా పని చేస్తేనే కుటుంబం సాగుతుందని ఏం చేయకపోతే ఎలా అని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన దేవదానం బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మృతదేహం లభ్యం

జోగిపేట రూరల్, అక్టోబర్22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం మంజీరా నదిలో లభ్యమైంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని రోళ్లపహడ్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరల మేరకు.. రోళ్లపహడ్ గ్రామ శివారులోని మంజీరా వాగు చేక్ డ్యాం సమిపంలో అటు వైపుగా వెళ్తున్న స్థానికులు వ్యక్తి మృతదేహన్ని గుర్తించారు. అనంతరం పోలిసులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తించలేని స్థితిలో ఉండడంతో నీలిరంగు జేబుతో, తెల్లని చొక్కా ధరించి ఉన్న మృతదేహన్ని గుర్తించి తమకు సమాచారాన్ని అందించాలని ఎస్సై పాండు తెలిపారు.

రోడ్లపై ధాన్యం

- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

వెల్దుర్తి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): వరికోతలు జోరందుకున్నవి. రైతులు వరికోత మిషన్లతో వరిని కోయిస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఎక్కడ పడితే అక్కడ ఆరబోస్తున్నారు. రైతులు పండించిన పంటలను రహదారులపై ఆరబెడుతున్నారు. ధాన్యం అరబెట్టడంతో ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యం కుప్పలు రాత్రి సమయంలో కనిపించకపోవడంతో ద్విచక్రవాహనాలు స్కిడ్ కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో పాటు రోడ్డుపైనే ఎగబోస్తుండటంతో దుమ్ము, ధూళి రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల కళ్లలో పడుతుంది. దీంతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులు కింద పడుతున్నారు. గతంలో రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం కుప్పలతో ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలు కాగా, పలువురు ప్రాణాలను సైతం కోల్పోయారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకుండా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, తగిన చర్యలు తీసుకొని విలువైన ప్రాణాలను కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలు



ఆరెగూడెం గ్రామ శివారు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు



వరి కోతల సమయంలో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రతి సీజన్‌లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపై ధాన్యం ఆరపోయవద్దని రైతులకు చెబుతూ అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ధాన్యం రోడ్లపై ఆరబోసి ప్రమాదాలకు కారణం కావద్దని, రైతులు రోడ్లపై ధాన్యం పోయకుండా ప్రజలకు సహకరించాలని, ధాన్యాన్ని తమ పొలాల వద్ద, ఆరబెట్టేందుకు రైతులు కల్లాలను ఉపయోగించుకోవాలి. రోడ్లపై ధాన్యం ఆరబోసి ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

\- ఎస్ఐ రాజు, వెల్దుర్తి

ఇబ్బందిగా ఉంది



రోడ్లపై ధాన్యం అరబెట్టడం వల్ల వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళలో రోడ్డుపై అరబెట్టిన ధాన్యం కనబడకపోవడంతో బైక్ స్కీడ్ కావడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలి.


\- శ్రీనివాస్, వెల్దుర్తి










చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థులు

గురుకల చెదిరింది..!

40 ఏళ్లపైబడి చరిత్ర

లింగంపల్లి గ్రామ శివారులో సొసైటీ భవనం నిర్మాణం చేపట్టకముందే.. 1982లో సదాశివపేట పట్టణంలోని మోమిన్‌పేట రోడ్డులో గల ఓ అద్దె భవనంలో 8వ తరగతి నుంచి ఈ గురుకుల పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడ ఐదేళ్ల పాటు కొనసాగింది. లింగంపల్లి గ్రామ శివారులో స్థల సేకరణ చేసి భవన నిర్మాణాలు చేపట్టి 1985-86లో లింగంపల్లికి మార్చారు. మొదట్లో 200మంది విద్యార్థులతో ప్రారంభమై.. ఇప్పుడు 6, 7, 8, 9, 10వ తరగతితోపాటు ఇంటర్మీడియట్ వరకు మొత్తం 640మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

అది సుమారు 50 ఏళ్ల చరిత్ర ఉన్న గురుకుల పాఠశాల. ఇక్కడ చదివిన విద్యార్థులు ఇప్పుడు ఉన్నతస్థాయిలో ఉన్నారు. ఈ పాఠశాలలో సీటు దొరికితే చాలు జీవితంలో ఎదిగినట్లే అని తల్లిదండ్రులు, విద్యార్థులు భావిస్తారు. ఇంతటి ఘనత ఉన్న ఈ పాఠశాలలో ఇప్పుడు కనీస సదుపాయాలు కరువయ్యాయి. మండలంలోని లింగంపల్లి సొసైటీ గురుకుల పాఠశాల హాస్టల్ భవనం కూలి పోవడంతో చెట్ల కింద భోజనం, తరగతి గదుల్లో బస చేయాల్సి వస్తోంది.

- అక్కడే చదువు.. అక్కడే పడక
- కూలిన ఏళ్లనాటి పురాతన భవనం
- ఇంకా పూర్తికాని రేకుల షెడ్డు
- చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థులు
- ఇదీ.. లింగంపల్లి గురుకుల పాఠశాల దుస్థితి

మునిపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి సొసైటీ గురుకుల పాఠశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్ పురాతన భవనం శిథిలావస్థకు చేరి సెప్టెంబర్ 9న కూలిపోయింది. నాటి ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లుతో పాటు గురుకుల కార్యదర్శి, అధికారులు సందర్శించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. తాత్కాలికంగా విద్యార్థుల బస కోసం రేకుల షెడ్లు వేయాలని సూచించారు. రేకుల షెడ్డుతో పాటు నూతన భవనం కోసం రూ. 7 కోట్లను మంజూరు చేశారు.


ఖాళీగా బడి భవన నిర్మాణ స్థలం

పూర్తికాని తాత్కాలిక షెడ్డు

మంత్రి, ఇతర అధికారుల ఆదేశాల మేరకు వెంటనే తాత్కాలిక రేకుల షెడ్డు పూర్తి చేసి, విద్యార్థులకు బస కల్పించాల్సి ఉండగా, ఆ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. హాస్టల్ భవనం కూలిన వెంటనే విద్యార్థులంతా ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత దసరా సెలవులు వచ్చాయి. దసరా సెలవుల తర్వాత తాత్కాలిక భవనం అందుబాటులోకి వస్తుందని ఆశించి, పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు బస చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. శాశ్వత నిర్మాణాల ఊసే లేకుండా పోయింది.

తరగతి గదుల్లోనే..

హాస్టల్ భవనం కూలడం, తాత్కాలిక షెడ్డు పనులు ఇంకా కొనసాగుతుండటంతో తరగతి గదులపై ఉన్న రేకుల షెడ్డులో విద్యార్థులకు బస కల్పించారు. రేకుల మధ్య ఎడం కారణంగా గాలి రావడం, ఆసలే చలికాలం కావడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. కొందరు విద్యార్థులకు తరగతి గదుల్లోనే బస ఏర్పాటు చేయడంతో వారంతా తరగతులు జరుగుతున్న సమయంలో పక్కన తమ సామగ్రి ఉన్న బ్యాగులు పెట్టుకుని పాఠాలు వింటున్నారు. హాస్టల్ భవనం లేకపోవడంతో చెట్ల కింద భోజనాలు చేస్తున్నారు.

సైకిల్ మీద వెళ్లి చూసేవాళ్లం..



గురుకుల సొసైటీ పాఠశాల 1982లో సదాశివపేటలో మోమిన్‌పేటన రోడ్డులో అద్దె భవనంలో ఉండేది. తర్వాత లింగంపల్లికి శివారుకు మార్చారు. అప్పట్లో సదాశివపేట నుంచి లింగంపల్లికి సైకిల్‌ను అద్దెకు తీసుకొని వెళ్లి హాస్టల్ భవన నిర్మాణ పనులు చూసేవాళ్లం. కొత్త భవనంలో పదో తరగతి ఫస్ట్ బ్యాచ్ మాదే. ఇప్పుడా భవనం శిథిలావస్థకు చేరి కుప్పకూలింది. పాత హాస్టల్‌లో ఉన్న రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా భవనాలు నిర్మించాలి.

- ఉప్పరి రమేష్‌కుమార్, పూర్వవిద్యార్థి, వ్యాపారవేత్త

మంచి హోదాలో ఉన్నారు..



లింగంపల్లి సొసైటీ గురుకుల పాఠశాలలో సీట్ వచ్చిందంటే అదృష్టంగా భావించే వాళ్లు. ఈ పాఠశాలలో చదువుకున్నోళ్లు ఎన్నో ఉన్నత శిఖరాలకు అధిరోహించి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నారు. నేను 1997-98లో పదో తరగతి వరకు చదువుకొన్నాను. మొదట ప్రభుత్వ టీచర్‌గా, తర్వాత హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగం చేస్తున్నాను. చాలామంది తోటి విద్యార్థులు ఉన్నత హోదాలో ఉన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే హాస్టల్ భవన నిర్మాణం చేపట్టాలి.

-క్రిష్ణవంశీ, పూర్వ విద్యార్థి, ఝరాసంగం

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- వర్గల్‌లో పీహెచ్‌సీ ప్రారంభం
- గజ్వేల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

గజ్వేల్ /సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో పీఆర్ నిధులతో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ సీబ్లాక్‌లో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 3500మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. సిద్దిపేట జిల్లాలో నూతనంగా 26వేల ఇళ్లను అందజేశామని, వచ్చే డిసెంబరులో మరో 3500 అందిస్తామన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, కలెక్టర్ హైమావతి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఎంపీడీవో మచ్చేందర్, మండల వైద్యాధికారి డాక్టర్ మీణ, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై బల్లి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంత్రి వివేక్ వెంకటస్వామి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తుండగా, ఐఓసీకి వచ్చే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి బల్లి చేరడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆన్ చేసినప్పటికి ట్రిప్ అవుతుండడంతో దాదాపు నాలుగు నిమిషాల అనంతరం కరెంట్‌ను పునరుద్ధరించారు. మంత్రి అప్పటికే కొన్ని చెక్కులను చీకట్లో పంపిణీ చేయాల్సి వచ్చింది. దీంతో బల్లి విద్యుత్ అధికారులను, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టినట్లు అయింది.

జీపీ కార్మికులకు ఇచ్చిన హామీ నీటి మూటలేనా..?

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నీటి మూటలేనా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు ప్రశ్నించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, మహేష్, పోచయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లైనా.. రాళ్లదారే..!



నిజాంపేట మండలం చల్మెడ గేటు నుంచి గ్రామాన్ని కలుపుతూ నందగోకుల్ వరకు వెళ్లే ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు కంకరతో ప్రయాణికులకు నరక ప్రాయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేసి వదిలేశారు. రెండేళ్లవుతున్నా ఈ దారిని పట్టించుకునే నాథుడే లేడు. దీనికి తోడు వర్షాలకు గుంతలు పడి కనీసం పాదచారులు నడవలేని దుస్థితి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మెదక్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

కార్తీక దీపోత్సవం...



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మహా మండపంలో కార్తీక శుద్ధ పాడ్యమిని పురస్కరించుకోని స్వామివారి ఉత్సవ మూర్తుల ఎదుట మహగణపతి స్తోత్ర పఠనం గావించి శివలింగకారంలో దీపాలను వెలిగించారు. మహిళలకు ఆలయాధికారులు ప్రమిదలు, పూజ సామాగ్రిని అందించారు

-కొమురవెల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి)

ఆస్తి తగాదాలతో తండ్రిని హతమార్చిన కొడుకు


నిజాముద్దీన్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో మద్యం మత్తులో కొడుకు కన్న తండ్రిని హతమార్చాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్ (65)కు అతని కొడుకు షేక్ సాదక్‌తో కొద్ది రోజులుగా ఆస్తి విషయంలో తగువు కొనసాగుతోంది. ఈ క్రమంలో నిజాముద్దీన్, షేక్ సాదక్ అతని మిత్రుడు రాజుతో కలిసి ముగ్గురు మంగళవారం శామీర్‌పేట మండలం మురాహరిపల్లి సమీపంలోని ప్రజయ్ వాటర్ ప్లాంట్ వద్ద మద్యం సేవించారు. ఆ సమయంలోనూ తండ్రీకొడుకుల మధ్య ఆస్తి విషయంలో తగువు పడ్డారు. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో సాదక్ అక్కడే ఉన్న బండరాయితో తండ్రి నిజాముద్దీన్ తలపై మోదీ అక్కడ నుంచి మిత్రుడు రాజుతో కలిసి పరారయ్యాడు. బుధవారం ఉదయం నిజాముద్దీన్ మృతదేహాన్ని చూసిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, హత్యకు పాల్పడ్డ షేక్ సాదక్ అతడి మిత్రుడు రాజును పోలీసులు అదుపులో తీసుకున్నట్టు సమాచారం. ఆస్తి విషయంలో మాటామాట పెరిగి హత్యకు దారి తీసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు సమాచారం. ఇదే కోణంలో పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆరు మున్సిపాలిటీలకు రూ.90 కోట్ల నిధులు

- తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు కేటాయింపులు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఆరు మున్సిపాలిటీలలో తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ఇతర మౌలిక వసుతల కోసం పురపాలక శాఖ రూ.90 కోట్ల నిధులు కేటాయించింది. ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్ల చొప్పున దేవరకద్ర, ఆలియాబాద్, గడ్డపోతారం, గుమ్మిడిదల, కోహీర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తూ పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

అక్రమ దందా.. అధిక వసూళ్లు

వైద్యం పేరుతో కొందరు ఆర్ఎంపీల దోపిడీ

- ఇతర రాష్ట్రాల కార్మికులే లక్ష్యం
- మెడికల్ షాపులు నడుపుతూ అధిక ధరలకు మందుల విక్రయం
- విచ్చలవిడిగా గర్భస్రావ మాత్రలు, కిట్ల అమ్మకాలు
- స్థానిక నాయకుల అండదండలతోనే రెచ్చిపోతున్న కొందరు
- తమకేమీ పట్టనుట్ల వ్యవహరిస్తున్న జిల్లా వైద్య అధికారులు

మనోహరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయాల్సిన ఆర్ఎంపీ వైద్యులు కార్మికులను లక్ష్యంగా చేసుకొని లక్షలకు లక్షలు దోచుకుంటున్నారు. జిల్లా వైద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పరిశ్రమల హబ్‌గా ఉన్న మనోహరాబాద్‌లో అనేక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వస్తున్నారు. పరిశ్రమల్లో పరిమితికి మించి 12 గంటలు పనిచేయడం, సరైన ఆహారం దొరక్కపోవడం వల్ల కార్మికులు తరచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెద్ద వైద్యానికి డబ్బులు లేక, వీరంతా గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అదునుగా భావించిన ఆర్ఎంపీలు.. కామారెడ్డి, వరంగల్ వంటి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, పరిశ్రమలు ఉన్న గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు. కొద్ది సంవత్సరాల్లోనే వీరు కోట్లకు పడగలెత్తుతున్నారు. మండల కేంద్రంలో సుమారు 50 వేల మందికి పైగా ఇతర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. ఈ ఆర్ఎంపీలు తమ వృత్తిని అడ్డుపెట్టుకొని కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వారికి వచ్చిరాని వైద్యం చేసి, వైద్యం వికటించిన తర్వాత వారే వేరే పెద్ద ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా, అధికారులకు ముందే తెలిసినా, వైద్యం పేరుతో నడుస్తున్న కోట్ల రూపాయల దందాపై కలెక్టర్ యంత్రాంగం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆధార్ కార్డు చూసి..

మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, మనోహరాబాద్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం, జీడిపల్లి, రంగాయపల్లి, దండుపల్లి, కొండాపూర్ గ్రామాలలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ కొంతమంది ఆర్ఎంపీలు దొంగచాటుగా ఇతర రాష్ట్రాల కార్మికులను టార్గెట్‌గా చేసుకొని, వారి ఆధార్ కార్డులోని చిరునామా చూసిమరీ గర్భస్రావ మాత్రలు అమ్ముతున్నారు. ఎవరికీ చెప్పవద్దని చెప్పి, రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు గర్భస్రావ కిట్లు విక్రయిస్తున్నారు. అదే క్లినిక్‌కు తెలుగువారు వెళ్తే, వారి ఆధార్ చిరునామా చూసి తాము అమ్మడం లేదని చెబుతున్నారు.


మనోహరాబాద్ మండలం ఓ గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్

కొంతమంది ఆర్ఎంపీలు తూతూ మంత్రంగా వైద్యం చేస్తూ, వారి కింద ఎలాంటి అవగాహన లేని సిబ్బందితో పనిచేయిస్తున్నారు. ఒక్కో ఆర్ఎంపీ క్లినిక్‌లో అర్హతకు మించి 4 నుంచి 5 సెలైన్ బెడ్‌లను ఏర్పాటు చేసి, రోగులను అడ్మిట్ చేసుకోవడం, చిన్న గాయాలకు వచ్చిరాని వైద్యంతో కుట్లు వేయడం చేస్తున్నారు. చికిత్సకు అయ్యే ఖర్చు కంటే వసూలు చేసే మొత్తం ఎక్కువగా ఉంటోంది. రోజుకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు కలెక్షన్లు లక్ష్యంగా ఆర్ఎంపీ వైద్యులు వసూళ్లు చేస్తున్నారు.

నేతల అండదండలు

వేరే జిల్లాలలో ఉన్న ఆర్ఎంపీలు సైతం మనోహరాబాద్ మండలానికి దారి కడుతున్నారు. ముందుగా ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ముందుకు పోతున్నారు. అంతేకాక, వీరు తమ కుటుంబాలకు చెందినవారు లేదా బంధువుల పేరుతో అనుమతులు లేని మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. ఆర్ఎంపీలే వైద్యం చేసి, వారి షాపుల్లోనే మందులు అమ్ముతూ, ఎంఆర్‌పీ (గరిష్ఠ చిల్లర ధర) కంటే అధిక రేటుకు అమ్ముతూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీరికి స్థానిక రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. కాళ్లకల్ గ్రామంలో సుమారు 5 వేలకు పైగా కార్మికులు పరిశ్రమల్లో పనిచేస్తూ అద్దెకు ఉంటున్నారు. దీంతో కాళ్లకల్ గ్రామంలోనే సుమారు 20 వరకు ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉండటం గమనార్హం. అంతేకాక, రాత్రివేళల్లో అత్యవసరంగా ఆర్ఎంపీ ఆసుపత్రికి వెళ్తే, "నీకోసం మళ్లీ వచ్చాను, ఇంత రాత్రి వరకు ఉన్నాను కాబట్టి రూ.300 ఉన్న సెలైన్‌కు రూ.500 ఇవ్వాలి" అని డిమాండ్ చేస్తున్నారని బాధితులు తెలిపారు.

అధికంగా వసూలు..



మా గ్రామంలో సుమారు 50కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో ఇతర రాష్ట్రాల కార్మికులు వేల సంఖ్యలో నివాసం ఉంటున్నారు. పరిశ్రమల్లో పని చేసేటప్పుడు చిన్న గాయాలైతే ఆర్ఎంపీల దగ్గరికి వెళ్తారు. ఇతర రాష్ట్రాల వారు కావడంతో ఆర్ఎంపీ వైద్యులు అధికంగా వసూలు చేస్తున్నారని కొందరు కార్మికులు నాకు తెలిపారు.

- కాముగారి సర్విన్ గౌడ్, కాళ్లకల్ గ్రామం

అడిగినంత ఇవ్వాల్సిందే..



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. నేను గత 6 సంవత్సరాలుగా కాళ్లకల్ గ్రామంలో నివాసం ఉంటూ ఇక్కడే పరిశ్రమలో పనిచేస్తున్నాను. మా స్నేహితులు, ఇతరులు చెప్పగా, ఏ చిన్న గాయం అయినా ఆర్ఎంపీ వైద్యులనే సంప్రదిసాం. వచ్చే జీతంలో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఇతర రాష్ట్రాల వాళ్లం కావడంతో వైద్యంలో కూడా ధరలు ఎక్కువగా తీసుకుంటున్నారు. చేసేది ఏమీ లేక వారు అడిగినంత ఇస్తున్నాం.

- సంజీత్, కార్మికుడు, కాళ్లకల్

న్యూస్ బాక్స్

సిద్దిపేటలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉచిత శిక్షణ శిబిరం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో వన్ స్టెప్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31 వరకు ఉచిత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు హారిక బుధవారం తెలిపారు. సుమారు ఐదు రోజుల పాటు గ్లాస్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టై అండ్ డై పెయింటింగ్, పాట్ పెయింటింగ్, మధుబని ఆర్ట్, క్యా న్వాస్ ఆర్ట్, రివర్స్ ఆర్ట్, ట్రాక్ ఆర్ట్ అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలవారు ఐదు రోజుల పాటు ఉచితంగా శిక్షణ పొందేందుకు ఇన్‌స్టిట్యూట్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలి

రాయపోల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ 1 పోస్టు ఖాళీగా ఉందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన పని చేసేందుకు స్థానికులై ఉండి ఏడో తరగతి చదివిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. 360 మందికి వంట చేయాల్సి ఉంటుందని ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేయాలని సూచించారు. ఇంటర్వ్యూతో పాటు డెమో నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కిసాన్ కపాస్ యాప్ ద్వారానే పత్తి అమ్మకాలు చేపట్టాలి

మద్దూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులు పండించిన పత్తి పంటలను కిసాన్ కపాస్ యాప్ ద్వారానే విక్రయించుకోవాలని ఏవో రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మద్దూరులో విలేకరులతో మాట్లాడారు. రైతులు పత్తి విక్రయాలు చేపట్టే ముందు తప్పనిసరిగా ఆన్‌లైన్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ నిబంధన ప్రకారం పత్తి నాణ్యత ఉండటంతో పాటు ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం, బ్యాంకుఖాతా వివరాల్ని కిసాన్ కపాస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు మండల వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని సూచించారు.

హుస్నాబాద్ మార్కెట్‌కు పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలి

హుస్నాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలన్నా, కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ చేయలన్నా మార్కెట్ కార్యదర్శి అవసరమని, ప్రస్తుతం ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించడంతో పూర్తిస్థాయి సమయాన్ని ఇవ్వలేక పోతున్నాడని తెలిపారు. దీంతో రైతులు దళారుల బారిన పడి నష్టపోతున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని రెగ్యులర్ మార్కెట్ కార్యదర్శిని నియమించాలన్నారు.

మధ్యాహ్న భోజనకార్మికులకు బిల్లులను చెల్లించాలి

● సీఐటీయూ మండల కార్యదర్శి అంజయ్య

సిద్దిపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులను చెల్లించాలని సీఐటీయూ మిరుదొడ్డి మండల కార్యదర్శి అంజయ్య డిమాండ్ చేశారు. బుధవారం మిరుదొడ్డిలో మోడల్ స్కూల్లో మధ్యాహ్నభోజనకార్మికుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మధ్యాహ్న భోజనకార్మికులకు 8నెలల పెండింగ్ బిల్లులు రావాలన్నారు. ప్రభుత్వం బిల్లులను చెల్లించకుంటే వచ్చేనెల 1నుండి మధ్యాహ్నభోజనాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు.

జాగృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

హుస్నాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో జాగృతి పత్రిక ప్రత్యేక సంచికను ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ టి వెంకటరమణ ఆవిష్కరించారు. ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు చిట్టి దేవేందర్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్, గంగం రాంరెడ్డి, పోతుగంటి వెంకటరెడ్డి ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

చిన్నశంకరంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్విపల్లి శివారు మెదక్-చేగుంట రహదారిపై బుధవారం కారు చెట్టుకు ఢీకొని పలువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం రాంరెడ్డి గ్రామానికి చెందిన అవుసుల సాయిబాబా కుటుంబసభ్యులతో కలిసి వర్గల్‌కు కారులో బయలుదేరారు. కొర్విపల్లి శివారు వద్ద మెదక్-చేగుంట రహదారిపై పెద్ద గుంతను తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో కారులోని వారికి స్వల్పగాయాలు కాగా.. క్షతగాత్రులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

ఠాణాల్లో ఓపెన్ హౌజ్

● చట్టాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన



సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో స్టాళ్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంతో పాటు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో బుధవారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు స్థానిక పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 450 మంది విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీహెచ్. కుషాల్కర్ విద్యార్థులకు పోలీసు చట్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల గురించి వివరించారు. బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీటీమ్, కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, స్పీడ్ లేజర్ గన్, సైబర్‌క్రైం తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సుమారు 200 మంది విద్యార్థులకు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు పోలీసుల విధులు బాధ్యలపై అవగాహన కల్పించగా, రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ ఎస్‌ఐ కె.రాజేష్ అవగాహన కల్పించారు. గజ్వేల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు చట్టాలు, పోలీసుల విధులపై వివరించారు. చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ నవీన్ తొగుట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు సీఐ లతీఫ్, ఎస్‌ఐ రవికాంత్‌రావు, జగదేవ్‌పూర్‌లోని పోలీస్ స్టేషన్ ఓపెన్‌హౌజ్ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఐ కృష్ణారెడ్డి పోలీసు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కోహెడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ పి అభిలాష్, హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కీర్తి రాజు, కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజుగౌడ్, మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సమతా విద్యార్థులకు మహిళల చట్టాలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సమతా, హుస్నాబాద్‌లో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి రక్షణ చట్టాలపై వివరిస్తున్న దృశ్యం, చేర్యాలలో సీసీ కెమెరాల పనితీరును వివరిస్తున్న ఎస్‌ఐ నవీన్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ముత్తన్నపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి మండలంలోని తోటపల్లి, ముత్తన్నపేట, కల్లెపల్లి గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, బెజ్జంకి మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయకులు, రైతుల పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణవ్రతాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు,గ్రామస్థులు

5న సామూహిక సత్యనారాయణవ్రతాలు

సిద్దిపేట రూరల్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి); నవంబరు 5న సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై స్వయంభూ శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య అర్చకులు చిలుకమర్రి వెంకట ఫణికుమారాచార్యులు, కలకుంట్ల రంగాచార్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్రతంలో పాల్గొనే దంపతులు నవంబరు 1వ తేదీలోగా రూ.301లు చెల్లించి పేర్లు నమోదు చేసుకుని రసీదు పొందాలని సూచించారు.

వేంకటేశ్వరాలయాన్ని పునర్నిర్మించండి



టీటీడీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

గజ్వేల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధి దాచారం గ్రామంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడును గ్రామస్థులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రామస్థులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో జరిగే పునర్నిర్మాణానికి టీటీడీ నుంచి తగిన సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వారితో సాంబశివరావు, మిన్నకంటి ప్రసాద్, సుభాష్ చంద్రబోస్, వెంసాని వెంకటేశ్వర్లు, ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జగదేవ్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీర్లపల్లి గ్రామంలో బుధవారం 150 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తగా నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మౌనిక, మల్లికార్జున్, స్వామి, హరి పాల్గొన్నారు.



పీర్లపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ శ్వేత

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు



వీరన్నపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సిద్దిపేట, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శాస్త్రోక్తయుక్తంగా పంచామృత స్నపనం, తిరువాహన సేవ, కల్యాణం నిర్వహించారు.

కొమ్మూరిని కలిసిన ఐనాపూర్ వాసులు



జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఐనాపూర్‌వాసులు

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లోని తపాస్‌పల్లి రిజర్వాయర్ ఆవరణలో ఈ నెల 31న ఆంజనేయస్వామి ఆలయ భూమిపూజ మహోత్సవానికి హాజరు కావాలని ఆలయ నిర్మాణ కమిటీసభ్యులు బుధవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి,మార్కెట్ డైరెక్టర్లు తడక లింగమూర్తి, పాల లక్ష్మీనారాయణ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొమురవెల్లి: ఇటీవల కన్నుమూసిన మర్రిముస్త్యాల గ్రామంలోని సాంద్రానంద ఆశ్రమ నిర్వాహకుడు, ప్రముఖ పురోహితుడు అవధాని గౌరీభట్ల శ్రీనాథ శర్మ కుటుంబ సభ్యులను అలాగే ఇటీవల మృతి చెందిన ఒగ్గు తిరుపతి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పరామర్శించారు. వెంట నాయకులు మహదేవుని శ్రీనివాస్, మేర్గు శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

జగదేవ్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన కొల్తూరు రాజమ్మ అనారోగ్యానికి గురై, చికిత్స చేయించుకోగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 45 వేలు మంజూరయ్యాయి. బుధవారం తిగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు లబ్ధిదారుకు చెక్కును అందజేశారు.

కొమురం భీం జీవితం యువతకు ఆదర్శం

పలు కళాశాలల్లో భీం జయంతి కార్యక్రమాలు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్/గజ్వేల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమురం భీమ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సిద్దిపేట జిల్లా కుటుంబ ప్రబోధన్ సంయోజక్ చంద్రశేఖర్ గాందే మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల పోరాటాల స్థానం ఎంతో కీలకమైనదన్నారు. భీమ్ జీవితం నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. ఆయన మాటల్లో జల్, జంగిల్, జమీన్ అనే మాటలు గిరిజనుల హక్కుల స్వాభిమానాన్ని ప్రతిబింబిస్తాయన్నారు.కార్యక్రమంలో కళాశాల కామర్స్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ గోపాలసుదర్శనం, ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కో కన్వీనర్ పరశురామ్, కళాశాల అధ్యక్షుడు భాను ప్రసాద్, మహిళా ఇన్‌చార్జి అక్షయ, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమురంభీం చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతిరావు పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అటానమి కోఆర్డినేటర్ వెంకటేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, విశ్రాంతి ఉద్యోగుల, స్కావెంజర్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన ఏంఈవో యాదవరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. యాదవ రెడ్డి ఉద్యోగాన్ని ఒక సామాజిక బాధ్యతగా నిర్వర్తించారని కొనియాడారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఎంతో ఉత్సాహంతో పని చేశారన్నారు. అనంతరం యాదవరెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' రద్దు చేయాలి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలోని పాఠశాలలతో పాటు మండలంలోని జాలిగామ, బెజుగామ, అహ్మదీపూర్, బయ్యారం, సింగాటం, ఆరేపల్లి, బూర్గుపల్లి, అహ్మదీపూర్, అనంతరావుపల్లి, దాచారం, పిడిచెడ్ పాఠశాలలను టీపీటీఎఫ్ నాయకులు సందర్శించి, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని, పెడింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంట జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, జోన్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, మండల బాధ్యులు నాగరాజు, విద్యాసాగర్, సురేశ్, దమ్మని మల్లయ్య తదితరులున్నారు.

పీఆర్సీని అమలు చేయాలి



టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ అజీజ్, జిల్లా నాయకులు శివాజీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సిద్దిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు తాడూరి భరత్ కుమార్, ఎర్రబోసు ఆదిత్య, అక్రమ్, రవీందర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

భోజనం భారం..!

(5వ పేజీ తరువాయి)

నిరసన చేపట్టారు. కలెక్టర్ మేడం.. మా సమస్యలను పరిష్కరించండి అంటూ నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించాలి

మధ్యాహ్న భోజన పథక కార్మికులకు సమయానికి బిల్లులు, వేతనాలు చెల్లిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే అవకాశం ఉంటుంది. నూతన మెనూ ప్రవేశపెట్టి నాణ్యతపై సూచనలు చేస్తున్న ప్రభుత్వం, కార్మికులను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుంటే కార్మికులు ఎక్కడి నుంచి డబ్బు తెచ్చి ఆహారాన్ని అందిస్తారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే అందించాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం

- గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

అప్పులు చేసి సరుకులు తెస్తున్నాం

ప్రభుత్వం అందించే బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు ఆహారం అందించడానికి అప్పులు చేసి సరుకులు తీసుకురావాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలి

- రాజమణి, సంఘం జిల్లా అధ్యక్షురాలు



కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిరసన(ఫైల్)